నమస్తే తెలంగాణ
కామారెడ్డి
10 | నిజామాబాద్, మంగళవారం 15 ఏప్రిల్ 2025 | KAMAREDDY

అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి



వేల్పూర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకల్లో జెండా ఎగురవేస్తున్న మాజీ మంత్రి వేముల

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

వేల్పూర్, ఏప్రిల్ 14 : భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో వేముల పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గొప్ప మేధావి, మానవతావాది బాబాసాహెబ్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. సమాజంలో ప్రజల మధ్య అంతరాలు, అసమానతలు లేకుండా అందరూ సమానంగా జీవించినప్పుడే వారికి మనం ఘనమైన నివాళిర్పించినట్లు అని తెలిపారు. అంబేద్కర్ సూచించిన సమీకరించు, బోధించు, పోరాడు అనే విధానాన్ని కేసీఆర్ ఆదర్శంగా తీసుకుని రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. అంబేద్కర్ ఆనాడు కొత్త రాష్ట్రాలు ఏర్పడాలంటే బలమైన వారు ఎప్పుడు బలహీనులు వేరు పడుతామంటే ఒప్పుకోరని, రాష్ట్రాల ఏర్పాటు అసెంబ్లీ ద్వారా కాకుండా పార్లమెంటరీ ప్రక్రియ ద్వారానే ఏర్పడాలని ఆర్టికల్ 3 ని రాజ్యాంగంలో పొందుపర్చారని గుర్తు చేశారు.

125 అడుగుల విగ్రహాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలి

కేసీఆర్ సారథ్యంలో ప్రపంచంలోనే ఎత్తయిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మాణంలో తాను భాగస్వామిఅయినట్లు తెలిపారు. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకురాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని, అలాగే అక్కడ జయంతి వేడుకలు కూడా నిర్వహించలేదన్నారు. రెండేండ్ల తర్వాత అంబేద్కర్ విగ్రహాన్ని పూలతో మొదటిసారి అలంకరించారని తెలిపారు. ప్రజలకు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత విద్యార్థుల రీసెర్చ్ స్కాలర్స్‌తోపాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం దళిత స్టడీ సెంటర్‌ను కూడా నిర్మించామని, కానీ ఇంతవరకు ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురాలేదనని తెలిపారు. దీనిని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని వేముల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు నీరడి భాగ్య, జమున, దళిత సంఘం నాయకులు దాసు, రాజారాం, ప్రభాకర్, దాసు, అంబేద్కర్ యూత్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బాన్సువాడ డీఎస్పీతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల

ప్రజాస్వామ్యమా.. ఆటవిక రాజ్యమా?

దళితులపై దాడిపై ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం

అంబేద్కర్ జయంతి రోజున దళితులపై దాడి చేయడం అప్రజాస్వామికమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. లింగంపేట మండల కేంద్రంలో దళితులపైన పోలీసులు ప్రదర్శించిన కర్కశత్వంపై ఆమె 'ఎక్స్' వేదికగా స్పందించారు. అంబేద్కర్ జయంతి రోజున దాడి చేయడం ఊహకందని క్రూరత్వమని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ చెప్పిన ఇందిరమ్మ రాజ్యం ఇదేనా? అని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యమా.. ఆటవీక రాజ్యమా? అని నిలదీశారు. సంఘటనకు బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెన్షన్ వేటు వేయాలని కవిత డిమాండ్ చేశారు.

అంబేద్కర్ సాక్షిగా దళితులపై దౌర్జన్యం

లింగంపేటలో ఉద్రిక్తతకు దారి తీసిన ఫ్లెక్సీ వివాదం

మాజీ ఎమ్మెల్యే ఫొటో పెట్టారని ఫ్లెక్సీ తొలగింపు

ప్రశ్నించిన దళిత నేతలపై పోలీసుల క్రూరత్వం

దుర్భాషలాడిన ఎల్లారెడ్డి సీఐ

రాస్తారోకో చేస్తున్న వారిని లాగిపడేసిన పోలీసులు

ప్యాంటు ఊడిపోయినా అలాగే లాక్కెళ్లిన వైనం

దళితులకు మద్దతుగా నిలిచిన జాజాల

డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ



కామారెడ్డి -ఎల్లారెడ్డి రహదారిపై ఆందోళన చేస్తున్న దళిత సంఘం నాయకులు

లింగంపేట, ఏప్రిల్14: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా, ఆ మహానుభావుడి చెంతనే పోలీసులు దళితులపై దౌర్జన్యానికి దిగారు. ఫ్లెక్సీ తొలగించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన వారిపై క్రూరత్వం ప్రదర్శించారు. దుస్తులు ఊడిపోతున్నా పట్టించుకోకుండా, అర్ధనగ్నంగా ఉన్న వారిని వాహనాల్లో పడేసి అక్కడి నుంచి తరలించారు. సోమవారం లింగంపేట మండల కేంద్రంలో అంబేద్కర్ సాక్షిగా జరిగిన ఈ ఉదంతం ఉమ్మడి జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది.

ఆందోళన చేస్తున్న దళిత నాయకులను లాక్కెళ్తున్న పోలీసులు

ఫ్లెక్సీ తొలగించడంతోనే..

అంబేద్కర్ జయంతి సందర్భంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు నీరడి సంగమేశ్వర్.. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఫొటోతో ఫ్లెక్సీ ముద్రించారు. అయితే, మాజీ ఎమ్మెల్యే ఫొటో ఉన్న ఆ ఫ్లెక్సీని తొలగించాలని జీపీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ వచ్చి పంచాయతీ సిబ్బందిని పురమాయించి ఫ్లెక్సీని తొలగించారు. అయితే, దీనిపై దళిత సంఘాల నాయకులు ప్రశ్నించగా, సీఐ వారితో దురుసుగా ప్రవర్తించారు. దీంతో దళిత సంఘం నాయకులు సీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించారు.

లాగిపడేసిన పోలీసులు..

రాస్తారోకో చేస్తున్న వారిపై పోలీసులు దారుణంగా ప్రవర్తించారు. అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, ధ్యామని భూపతి, ఆశయ్య తదితరులను పక్కకు లాగిపడేశారు. ఈ క్రమంలో సాయిలు ప్యాంటు ఊడిపోయినా పట్టించుకోకుండా అలాగే లాక్కెళ్లి వాహనంలో పడేశారు. మిగతా వారిని కూడా బలవంతంగా లాక్కెళ్లారు. ఈ విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ నేతలు లింగంపేటకు తరలి వచ్చారు. దళిత సంఘాల ఆందోళనకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించారు. క్షమాపణలు చెప్పడంతో పాటు సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ 5 గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, కామారెడ్డి సీఐ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పక్కమం డలాలకు చెందిన పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

సస్పెండ్ చేయాల్సిందే..

అంబేద్కర్ జయంతి రోజునే సీఐ దళితులపై దౌర్జన్యానికి దిగడమేంటని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పోలీసు అధికారులు చెంచాలుగా మారి, బలి అవుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి వేధింపులు ఉండేవి కావని తెలిపారు. దళితుల పట్ల దురుసుగా వ్యవహరించిన సీఐ రవీందర్‌నాయక్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, సాయిలుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే జాజాల, దళిత నేతలకు డీఎస్పీ సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అరెస్టు చేసిన వారందరినీ విడిచి పెట్టాలని జాజాల కోరగా, పోలీసులు వారిని వదిలి పెట్టారు. దీంతో అక్కడికి చేరుకున్న మాజీ ఎంపీపీ సాయిలు మనస్తాపంతో రోదించగా, జాజాల ఓదార్చారు. అందరూ కలిసి అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. అనంతరం సాయిలు, దళిత సంఘాల నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎల్లారెడ్డి సీఐపై ఫిర్యాదు చేశారు

ప్యాంట్ ఊడిపోయినప్పటికీ అలాగే లాక్కెళ్తున్న పోలీసులు

అంబేద్కర్ మాటే.. కేసీఆర్ బాట

- అందుకే సచివాలయానికి ఆ మహానుభావుడి పేరు
- పేదరిక నిర్మూలన కోసమే దళితబంధు
- బాబాసాహెబ్ అంటే కాంగ్రెస్‌కు నచ్చదు, బీజేపీ మెచ్చదు
- కాంగ్రెస్, బీజేపీ నేతలు ఆధిపత్య దురహంకారులు
- అంబేద్కర్‌ను అవమానించేలా రేవంత్ పాలన
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధ్వజం

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మాటే కేసీఆర్ బాట అని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. అందుకే సచివాలయానికి ఆయన పేరు పెట్టారని, దేశంలోని 125 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. అదే అంబేద్కర్ సమసమాజ స్ఫూర్తి కాంగ్రెస్ పార్టీకి నచ్చదని, అసలు ఆయన రాసిన రాజ్యాంగాన్నే బీజేపీ మెచ్చదని విమర్శించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ జీవన్‌రెడ్డి సోమవారం ప్రకటన జారీ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అగ్ర నేతలు ఆధిపత్య దురహంకారులు అని, బడుగు, బలహీనవర్గాల వారిని సహించలేరని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని తన అవినీతి, అక్రమాలు, అవకాశవాద విధానాలకు అనుగుణంగా కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా సవరణలు చేసి అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచిందన్నారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా బీజేపీ ధోరణులు ఉన్నాయని, ఆ పార్టీ ఎజెండాకు అనుగుణంగా మరో రాజ్యాంగాన్ని తెరపైకి తెచ్చే దుష్ట తలంపుతో ఉందని మండిపడ్డారు. రాష్ట్రం ఏర్పాటుకు పార్లమెంట్ తీర్మానం చేస్తే సరిపోతుందన్న అంబేద్కర్ మాటే తెలంగాణ ఉద్యమానికి బాటలు వేసిందని జీవన్‌రెడ్డి తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తితో ఏర్పాటైన తెలంగాణలో ఆ మహానీయుడి ఆశయాలకు అనుగుణంగానే కేసీఆర్ పదేండ్ల పాలన సాగిందన్నారు. అంబేద్కర్ మాటే తన బాటగా, ఆయన ఆశయాల సాధనే లక్ష్యంగా కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. అంబేద్కర్ స్ఫూర్తికి కట్టుబడి పాలన సాగేలా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ సెక్రటేరియట్‌కు ఆయన పేరు పెట్టారని గుర్తు చేశారు. దళితుల్లో పేదరికాన్ని నిర్మూలించడం కోసమే కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. కానీ దళితబంధును రద్దుచేసిన రాక్షస పాలన కాంగ్రెస్‌దని మండిపడ్డారు. అంబేద్కర్‌ను అవమానించేలా రేవంత్ రెడ్డి పెత్తందారీ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. అధికారం ఉన్నా, లేకపోయినా బీఆర్ఎస్ అంబేద్కర్ బాట వీడదని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తూనే ఉంటుందని జీవన్‌రెడ్డి తెలిపారు.

మోపాల్ మండలం మంచిప్పలో అంబేద్కర్ విగ్రహానికి రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జగన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. -ఖలీల్‌వాడి, ఏప్రిల్ 14

నేడు బాన్సువాడలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

హాజరుకానున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బాన్సువాడ, ఏప్రిల్ 14: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలోని భారత్ గార్డెన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ కవిత, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరవుతారని పేర్కొన్నారు. కవిత, బాజిరెడ్డి గోవర్ధన్‌కు తాడ్కోల్‌గ్రామ శివాజీ విగ్రహం నుంచి ద్విచక్రవాహనాల ర్యాలీ ద్వారా స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. కవిత, బాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ , బీజేపీ నుంచి 150 మంది బీఆర్ఎస్‌లో చేరునున్నారని తెలిపారు. సమావేశానికి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

ఇరు వర్గాల మధ్య వాగ్వాదం

వేల్పూర్, ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి సందర్భంగా వేల్పూర్‌లో సోమవారం నిర్వహించిన వేడుకల్లో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. మాల కుల సంఘం ఆధ్వర్యంలో ఏటా జయంతి వేడుకలు నిర్వహిస్తుంటారు. సోమవారం మాల కుల సంఘం, అంబేద్కర్ ఉప కుల సంఘాల(మాదిగ, మాదిగ ఉపకులాలు) ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా వచ్చిన ఉప కుల సంఘాల సభ్యులు అంబేద్కర్‌కు పూలమాల వేసేందుకు వెళ్లగా, అక్కడే ఉన్న మాల కులస్తులు అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. ఏటా తామే జయంతి నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని, ఈసారి కొత్తగా వచ్చి, తమ కన్నా ముందుగా వేడుకలు నిర్వహించడం ఏమిటని మాల కులస్తులు ప్రశ్నించారు. అంబేద్కర్ అందరి వాడని, జయంతి వేడుకలను నిర్వహిస్తే ఎందుకు అడ్డుకుంటున్నారని మాదిగ, మాదిగ ఉప కుల సంఘాల సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఎస్సై సంజీవ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. ఉప కుల సంఘాల సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి వెళ్లిపోయారు. అనంతరం మాల సంఘ సభ్యులు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

చెక్కుల పంపిణీలో రాజకీయాలొద్దు?

- మంత్రి కోసం కార్యక్రమం రద్దు చేయడం దురదృష్టం
- పేదింటి ఆడబిడ్డలను ఇబ్బంది పెట్టొద్దు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఏప్రిల్ 14 : బాల్కొండ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో జాప్యం చేస్తూ లబ్ధిదారులైన ఆడబిడ్డలను ఇబ్బంది పెట్టొద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వేల్పూర్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ పూర్తిగా ఎమ్మెల్యే పరిధిలోని అంశమని తెలిపారు. ఇటీవల బడ్జెట్ సమావేశాల సమయంలో నియోజకవర్గంలో 847 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. చెక్కుల పంపిణీలో జాప్యం జరగొద్దనే ఉద్దేశంతో పంచాయతీ కార్యదర్శుల ద్వారా నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆర్డీవోకు నెల రోజుల క్రితం లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. కానీ మూడురోజుల క్రితం ఆర్డీవో ఫోన్ చేసి చెక్కుల పంపిణీ కోసం ఇన్‌చార్జి మంత్రి నియోజకవర్గానికి వస్తున్నారని సమాచారమిచ్చారని తెలిపారు. జీపీ కార్యదర్శుల ద్వారా చెక్కులను పంపిణీ చేయలేదని, మంత్రి పంపిణీ చేస్తారని నెలరోజులుగా అలాగే ఉంచినట్లు చెప్పారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు వారి అహంకారం, అధికార దర్పం కోసం ఎమ్మెల్యేతో పంపిణీ చేయొద్దనే స్వార్థబుద్ధితో చెక్కులను లబ్ధిదారులకు అందించకుండా ఆపివేశారని అన్నారు.

జీపీ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేయాలి

ఇన్‌చార్జి మంత్రి పంపిణీ కార్యక్రమానికి వస్తున్నారంటే స్వాగతిస్తామని, ఆయన మీద గౌరవంతో ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి నియోజకవర్గంలోనే తాను ఉన్నట్లు తెలిపారు. చెక్కుల పంపిణీ కార్యక్రమం మళ్లీ రద్దయినట్లు అధికారులు సమాచారం ఇచ్చారన్నారు. మంత్రి రాకపోతే పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలని, తాను పంపిణీ చేస్తానంటే..అధికారులు మాత్రం మంత్రి మళ్లీ సమయం ఇస్తారని చెప్పారని తెలిపారు. చెక్కుల పంపిణీ ఇప్పటికే ఆలస్యమైనందున లబ్ధిదారులకు నేరుగా కార్యదర్శుల ద్వారా అందజేయాలని డిమాండ్ చేశారు.

తులం బంగారం ఎప్పుడిస్తారు?

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రూ. లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆడబిడ్డలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటేసి అధికారం ఇస్తే 16 నెలలైనా తులం బంగారం కాదుకదా..తులం ఇనుము కూడా ఇవ్వడంలేదని ఎద్దేవా చేశారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు చెక్కులు అందుకున్న ప్రతిఒక్క ఆడబిడ్డకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 14: కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల్లో ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సబ్బండ వర్ణాలు మళ్లీ కేసీఆర్ కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో సోమవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలన తీరుపై ప్రజలు విసుగు చెందారని అన్నారు. గతంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎలాంటి హంగుఆర్భాటం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందించామని గుర్తుచేశారు. నేడు రూ.10వేల చెక్కులకు సైతం ఎంతో ఆర్భాటాలు చేస్తున్నారన్నారు. వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గం నుంచి నాలుగు వేల మంది ముఖ్యకార్యకర్తలో సభకు తరలివెళ్లనున్నట్లు చెప్పారు.

కేసీఆర్‌ను తిరిగి సీఎంగా చూడాలని ఆకాంక్షిస్తూ కొండగట్టువరకు పాదయాత్ర విజయవంతం చేసుకొని తిరిగి వచ్చిన బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంగళి యాదగిరిని మాజీ ఎమ్మెల్యే సురేందర్ సన్మానించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధయ్య, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కృష్ణ, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.